# ఆత్మద్రోహాలు

కళ్యాణకింకిణి వంటాబిడ తెచ్చిన కాఫీ త్రాగి అలాగే పక్కమీద కూర్చొని వుంది. బద్ధకంగా వుంది. మనస్సు కూడా పరిపరివిధాల పరుగెత్తుతూ వుంది. తాను పాల్గొంటున్న నాటకం రిహార్సల్స్, నిన్న జరిగినయి, తన అభినయం తనకేమీ నచ్చలేదు. ఎందుకనో యెంత ప్రయత్నించీ తన్ను తాను మరచి పోలేకపోయింది. పాత్రలో లీనం కాలేక పోయింది. రిహార్సల్స్‌నుంచి వచ్చి వంటాబిడ పెట్టింది తిని పడుకొని నిద్రపోయింది. తెల్లవారి మెలకువ వచ్చిందిగాని, లేవబుద్ధిపుట్టలేదు. వొళ్ళంతా నెప్పులుగా వుండి అలాగే పడుకుంది. వంటాబిడ లేచేటప్పటికి తప్పక లేచింది.

తన మనస్సు చీకాగ్గా వుంటానికి కారణం ఏమిటి? రిహార్సల్స్ తృప్తిగా వుండక పోవటమేనా? తను రిహార్సల్స్ యెన్నిసార్లు పాడుచెయ్యలేదు! ఆ మాటకి వొస్తే, యెందుకో తెలియదుగాని, రిహార్సల్స్ పాడైన నాటకాలు, ప్రదర్శనానికి వొచ్చేటప్పటికి అద్భుతంగా వున్నాయి.

కళ్యాణకింకిణి చాల బీదకుటుంబంలో పుట్టింది. తల్లిదండ్రులు పసి తనంలోనే గతించేటప్పటికి, పక్క మేడలో కాపురం వుంటున్న అలివేణి ఆమెను పెంచి పెద్దదాన్ని చేసింది. అలివేణి గొప్ప డ్యాన్సర్స్. ఆరోజుల్లో ఆమెకు చాల పెద్దపేరు వుండేది. ఉన్నచోట వుండకుండా యెప్పుడూ

"వస్తున్నారు," అని చెప్పింది అక్క.

రామండా చెయ్యవలసిందని ఆమె మా అక్కను కోరింది.

"మీరే చేసుకోరాదూ?" అని అడిగింది అక్క.

తాము సంసారులమని, పురుషులను ఆకర్షించే నేర్పు తాము వృత్తిగా పెట్టుకున్న వాళ్ళం కామనీ, అందుకని అలా వృత్తిగా పెట్టుకున్నవాళ్ళతో పోటీపడి తాము భర్తలను కాపాడుకోలేమనీ ఆమె అన్నది. కాబట్టి తనభర్తను విడిచిపెట్టమని కోరింది.

ఈ మాటలకు అక్కకు కోపంవచ్చి "పోనీ మీరు నాదగ్గర ఎందుకు నేర్చుకోగూడదూ?" అన్నది.

"వారితోపాటు మీరు కూడా రండి, నేర్పుతాను," అన్నది.

అక్క మాటలకు ఆమె ఉలిక్కిపడింది. కంగారుపడింది. సంబాళించుకొని "నా కెందుకివన్నీ-నేను సంసారిని." అన్నది.

"చేశావులెద్దు సంసారం నువ్వుగాంగా" అన్నది అక్క. అక్క సంగతి నాకు తెలుసు. అక్క యేదైనా ఓర్చుకో గలదుగాని 'నేనుసంసారి' అని ఏ స్త్రీ గొప్పగా చెప్పుకున్నా ఓర్చుకో గలిగేదికాదు.

అంతటితో ఊరుకోక, "పోనీ మీరే ఒదిలిపెట్ట గూడదా?" అని అడిగింది అక్క.

"నేను తాళి కట్టినదాన్ని..." అని ఉక్రోషంగా మొదలుపెట్టింది ఆమె.

దేశం అంతా ప్రదర్శనాలిస్తూ తిరుగుతూ వుండేది. ఎక్కడకు వెళ్ళినా తనతోపాటు కళ్యాణకింకిణిని తీసుకు వెళ్తుండేది. కళ్యాణకింకిణి చిన్నతనంలో కొద్దిగా డ్యాన్సుకూడా నేర్చుకుంది. ఏ బాధ్యతా లేకుండా అదొక ప్రత్యేక వాతావరణంలో పెరిగి పెద్దదైంది కళ్యాణకింకిణి.

వారు డ్యాన్సు ప్రదర్శనా లివ్వటానికి వొకసారి కాశ్మీర్ వెళ్ళారు. ప్రదర్శనాలు చాల విజయవంతంగా జరిగాయి. కాశ్మీర్‌లో వున్న పెద్దలందరూ పొగిడారు. అలివేణికి కొద్దికొద్దిగా అన్ని రకాల డ్యాన్సులూ వొచ్చు. భరతనాట్యం, మణిపురీ, కథక్, కథాకలీ మొదలైన అన్ని డ్యాన్సులలోనూ ఆమెకు ప్రవేశంవుంది. అందువల్ల ఆమె ఏ రాష్ట్ర వాసులనైనా యిట్టే వశపరచుకునేది. మనిషికూడా చాల మంచిది. ఏ రాష్ట్రంలో సంపాదించినడబ్బు ఆ రాష్ట్రంలోనే, ఏ అనాథశరణాలయానికో ఇచ్చి వేస్తూవుండేది.అందువల్ల డ్యాన్సులమీద అభిమానం వున్నవారే కాక పెద్ద పెద్ద సంఘసంస్కర్తలూ, రాజకీయ వేత్తలుకూడా ఆమెపట్ల చాల గౌరవభావంతో వుండేవారు.

కాశ్మీర్లో వుండగానే ఆమెకు హృద్రోగం వచ్చింది. అకస్మాత్తుగా మరణించింది. అప్పుడు లెక్క చూచుకుంటే కళ్యాణకింకిణికి మిగిలిన ఆస్థి యెక్కువగా లేదు. తరువాత కొన్నాళ్ళు కళ్యాణకింకిణి తానే స్వయంగా డ్యాన్సు ప్రదర్శనాలివ్వ నారంభించింది. కాని ఆమె మనస్సును అందలో ప్రవేశపెట్టలేకపోయింది. నాటకాలు ప్రారంభించింది. ఇప్ప

టికీ ఆమెకు వొక ట్రూపు వుంది. ఆ ట్రూపుతో యేడాదికి అయిదారు నాటకాలు వేస్తుంది. అవికాక ప్రత్యేక ఆహ్వానం మీద ఇతర నాటకాల్లో వేషాలు వెయ్యటంకూడా కద్దు. అటువంటి నాటకాల్లో వేషం వేసినప్పుడు, వేషానికి రెండు వందల రూపాయిలు పుచ్చుకుంటూవుండేది, ఒక విధంగా చూచుకుంటే కాలం బాగానే గడిచి పోతూవుంది.

"అమ్మా, ఎక్కడినుంచో టెలిగ్రాం వొచ్చిందమ్మా." అన్నది వంటాబిడ కవరు అందిస్తూ.

కళ్యాణకింకిణి కవరును చించి చూచింది "వెంటనే బయలుదేరు. అత్యవసరం_ ఆర్. వి" అని వున్నది.

ఎవ్వరీ ఆర్. వి? ఆమెకు వెంటనే జ్ఞాపకం రాలేదు. ఆ టెలిగ్రాం హైదరాబాద్ నుంచి వచ్చింది. హైదరాబాద్‌లో తనకు యెక్కువమంది స్నేహితులులేరు. అందులో ఆర్. వి. అనేపేరు విన్నట్టుగా కూడా లేదు. టెలిగ్రాం చేత్తో పట్టుకొని యెవ్వరా అని ఆలోచించింది. అప్పుడామెకు జ్ఞాపకం వొచ్చింది. అతనే అయివుండాలి అనుకున్నది.

రెండుసంవత్సరాల క్రిందట రవివర్మ అనే ఆయన అతని నాటకంలో కథానాయిక పాత్ర ధరించటానికి గాను తనను హైదరాబాద్ పిలిపించాడు. ఈ టెలిగ్రాం ఇచ్చింది, ఆయనే అయివుండాలి అనుకున్నది కళ్యాణకింకిణి. అయితే తనతో పనేమున్నది? మరొక నాటకం వేయిస్తున్నాడేమో! నాటకాని కయితే ముందుగానే అన్ని సంగతులు విపులంగా వ్రాయవచ్చుగదా? టెలిగ్రాం యివ్వవలసినంత తొందర యేమొచ్చింది?

ఆమెకు పూర్వం తాను హైదరాబాద్ వెళ్ళినప్పటి సంగతులు జ్ఞాపకం వొచ్చాయి. రవివర్మ ఒక నాటకం స్క్రిప్టు పంపించాడు. అందులో కథానాయిక పాత్ర వెయ్యవలసిందని కోరాడు. స్క్రిప్టు ఆమెకు నచ్చింది. వేషం వెయ్యటానికి అంగీకరించి హైదరాబాద్ బయలుదేరింది.

రవివర్మ కళ్యాణకింకిణిని రిసీవ్ చెయ్యటానికి స్టేషన్‌కి వచ్చాడు. రవివర్మని చూడటం ఆమెకు అదే మొదటిసారి. ఆయనకు ఏభై సంవత్సరాలు దాటి వుంటై. కాని ఏభై సంవత్సరాల మనిషిలాగా కనుపించడు. నల్లని వెంట్రుకలు; చెవులదగ్గర మాత్రం నెరసి ముఖానికి ఒక వింతసోయగాన్ని చేకూరుస్తూ వున్నాయి. పంచెకట్టి బిళ్ళగోచీ పెట్టి, నల్లని వులెన్ షేర్వాణీ వేసుకొని వున్నాడు. ఆ వయస్సులో కూడా ముఖంలోవున్న మృదుత్వం ఏమాత్రం తగ్గలేదు. మంచి శిల్పి చెక్కిన శిలావిగ్రహానికివలె అన్నీ తీర్చిదిద్దిన తీరికలు. ఆయన కంఠం మరీ ఆకర్షించింది కళ్యాణకింకిణిని. కంబుకంఠం అంటే ఇలాగే వుంటుంది కాబోలు అనుకున్నది. పెదిమలమీద యెప్పుడూ చిరునవ్వు నాట్యం చేస్తూ వుంటుంది. కాని చూపుల్లో విషాదచ్ఛాయలు, యేదో తీరని ఆవేదన ద్యోతకం అవుతూవున్నాయి.

ఆయన అలాగే చూస్తూ నుంచున్నాడు వచ్చి పలకరిస్తాడని కళ్యాణకింకిణి కాసేపు తచ్చాడింది. గాని, అలాజరగలేదు. చివరికి ఆమే అతని దగ్గరకు వెళ్ళి, "మీరు రవివర్మగారనుకుంటాను" అన్నది. చాలా సిగ్గుపడుతూ, తలవంచుకొని

అతను సమాధానం చెప్పాడు; "అవునండీ, మీ కోసమే వొచ్చాను. మిమ్మల్ని యెలా పలకరించాలో తెలియక నుంచున్నాను" అన్నాడు.

కళ్యాణకింకిణి తన జీవితంలో చాలా మంది మనుష్యుల్ని చూచింది. ఎవ్వరితో యెలా మసులుకోవాలో ఆమెను తెలుసు. "పోనీలెండి. నేనే పలకరిస్తూవుంటాను. మీరు మాత్రం అడిగినదానికి సమాధానం చెపుతూవుండండి. అంతవరకు చెయ్యండి" అన్నది.

ఆయన నవ్వాడు.

"మీ ఆహ్వానం మీద ఈ పట్టణంలో అడుగుపెట్టాను గదా. ఇప్పుడేం చెయ్యమంటారో చెప్పండి" అన్నది.

"మీకు హోటల్లో బస యేర్పాటు చేశాను. అక్కడ మీకే యిబ్బందీ రాదు."

"పదండి."

రవివర్మ ఆమెను హోటలుకి తీసుకు వెళ్ళాడు తన కారులో. దారిలో అతన్ని మాటల్లోకి దింపాలని, "నేను నటించవలసిన నాటకం వ్రాసిన దెవరు?" అని అడిగింది.

ఆయన కొంచెంసేపు ఆలోచించి, "నేనే" అన్నాడు.

"అయితే నేను అనుకున్నది కరక్టే."

"ఏమనుకున్నారు మీరు?"

"మీరు పంపించిన స్క్రిప్టు చదివి మీలాంటి రచయితనే వూహించుకున్నాను" అన్నది.

అతను బాధగా నవ్వి వూరుకున్నాడు. 'మీరు వూహించుకున్న రచయిత లక్షణాలేమిటి?' అని అడుగుదాం అనుకొని తన్ను గురించి తాను తెలుసుకోటానికి భయపడి వూరుకొన్నాడు.

కళ్యాణకింకిణికి అతన్ని చూస్తే జాలి వేసింది. "ఎందుకు జీవితమంటే మీకింత భయం?" అని అడిగింది.

"కారణం తెలిస్తే ఇంకేం?" అన్నాడతను తనలోకి తాను చూచుకుంటూ. అని వొక్క నిట్టూర్పు విడిచాడు.

"మీరు చాలా చిత్రమైన మనుష్యులుగా కనుపిస్తున్నారు."

"నాకు నేను సహజంగా వున్నట్టే కనిపిస్తుంది."

"మీ వైచిత్ర్యం చాలా సహజమైంది" అన్నది కళ్యాణకింకిణి. "కొందరు ఇతరుల దృష్టులను ఆకర్షించాలని విచిత్రంగా కనపడతారు. అటువంటివారు యిటీవల చాలా మంది కనిపిస్తున్నారు. మీరు అలాంటివారు కాదు. మీ విచిత్రత చాలా స్వభావసిద్ధమైంది" అన్నది కళ్యాణకింకిణి.

ఈ మాటలకు అతని మనస్సు కృతజ్ఞతా భావంతో నిండింది. ఆమెను ఆప్యాయతగా చూశాడు. నిర్భయంగా ఆమెను చూడటం అతనికి యిదే తొలిసారి.

ఆమె చాలా నాజూగ్గా వుండే మనిషి. సన్నగా పొడుగ్గా వుంటుంది. పచ్చని పసుపుచాయ; కండ్లు పెద్దవి అవటమే కాక తళతళ మెరిసిపోతూ వుంటై; సన్నని నడుము; ఆమె సన్నగా వుండటమేగాని, బలహీనంగా వుండదు. ప్రతి

అవయవం యౌవనంతో స్పందిస్తూవుంది. తన దగ్గరగా వున్న ప్రతి వ్యక్తికీ పెదవి కదల్చకుండానే వుత్సాహం యివ్వ గలిగిన శక్తిగలది ఆమె. అటువంటి సమయాల్లో ఆమె శరీరమే మాట్లాడగలదు. దగ్గరగా వున్న వారి ఆలోచనలకు అసందిగ్ధంగా సమాధానాలు చెప్పగలదు.

"నా నాటకంలో నటించటానికి మీరు అంగీకరించటం నా అదృష్టం" అన్నాడు రవివర్మ.

"నాటకాలు ఆడటం నా వృత్తి అండోయ్. ఆ మాట మరచిపోకండి"

"రకరకాల పాత్రలతో తాదాత్మ్యం పొందటం మీ శక్తి. నాటకాలు ఆడటం నా వృత్తి అని అనకండి" అన్నాడు రవివర్మ.

కళ్యాణకింకిణి రవివర్మను క్రీగంట చూసింది. తను వూహించినదానికంటే విచిత్రమైన మనిషిగా కనుపించాడు. తన ప్రక్కన కూర్చున్న ఆ మనిషిని గురించి ఆలోచిస్తూ కూర్చుంది. రవివర్మ తన్ను గురించి తనకంటే తీవ్రంగా ఆలోచిస్తున్నాడని ఆమెకు తెలుసు.

ఆమెకోసం నిర్దేశించబడిన హోటలు గదిలో ఆమెను దింపి, సాయంకాలం వచ్చి రిహార్సల్‌కి తీసుకువెళ్తానని చెప్పి, వెళ్ళిపోయాడు రవివర్మ.

ఆమె ఆలోచిస్తూ కూర్చుంది.

ఆ పట్టణంలోకల్లా అది పెద్ద హోటలు; మంచి హోటలుకూడాను. ఆమె గది పై అంతస్థులో వుంది. ఎదు

రుగా డాబా. ఆ డాబామీద మంచి మంచి పూలమొక్కలు వున్నాయి. డాబాకు రెండుప్రక్కలా సోలుపుగా ఎలక్ట్రిక్ స్థంభాలు వున్నాయి. వాటిమీద పూర్ణచంద్రులకుమల్లే తెల్లగా వున్న డోములు అమర్చబడి వున్నాయి. అటువంటి డోముల్లో లైట్లు వెలగటం ఆమె మనస్సుకి యెప్పుడూ ఆహ్లా దాన్ని కలిగిస్తుంది. కాశ్మీర్లోనూ, బెంగుళూరులోనూ యిటు వంటి దీపపు తోరణాలను చూస్తూ తాను యెన్నో గంటలు తన్మయత్వంతో గడిపేది. కారణం యేమోగాని ఆ ప్రదేశా ల్లోని చలి ఈ దీపాల అందాన్ని యినుమడింపజేసేది. రగ్గు కప్పుకొని ఆ చలిలో వొంటరిగా కూర్చొని చూస్తుంటే డోముల్లోనుంచి ప్రకాశిస్తున్న ఆ దీపాలూ తనవంటివే అని పించేది.

తన గది బాగా అలంకరించబడి వుంది. అది మేడపైన వున్న గదుల్లో ఒక కొనన వుండి నిశ్శబ్దంగా వుంది. తన మనస్సు వుల్లాసంగా వుండటానికి, రవివర్మ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు ఆమె క్షణంలో గ్రహించింది.

ఎవ్వరీ రవివర్మ? తాను బయలుదేరినప్పుడు యిటు వంటి వ్యక్తిని కలుసుకుంటానని ఆమె అనుకోలేదు. మామూ లుగా నాటకాలు ఆడించే వ్యక్తులకు వున్న లక్షణాలేమీ అతనిలో కనిపించవు. విరహవేదన, ఏదో తీరని వ్యధ పడు తున్న కవుల్లో వుండే లక్షణాలుమాత్రం చాలా వున్నాయి. ఎవ్వరీ రవివర్మ? తన్నెందుకు పిలిపించాడు? ఈ పట్టణంలో. చక్కగా నటించేవారు లేకనా? పోనీ తన నటనను చూచి మోజుపడి ఆహ్వానించాడేమో అనుకోటానికి, తన నటనను

కథా నిలయం 3544

చూచే అవకాశం అతని కెప్పుడూ కలిగివుండి వుండదు. మరి తన్నెందుకు పిలిపించినట్లు?

ఆ సాయంకాలం కళ్యాణకింకిణిని రిహార్సల్‌కి తీసుకు వెళ్ళటానికి రవివర్మ కారు తీసుకొని వచ్చాడు. ప్రయాణ బడలికలో వుందేమో కళ్యాణకింకిణి, అప్పటిదాకా మైమరచి నిద్రపోయింది. అతనిని గదిలో కూర్చోబెట్టి డ్రెస్ చేసుకోవటం మొదలుపెట్టింది.

రవివర్మ ఇబ్బందిపడి, "నేను కార్లో కూర్చొని వుంటాను. డ్రెస్ చేసుకోవటం త్వరగా పూర్తిచేసుకొని రండి" అన్నాడు.

"ఫరవాలేదు, కూర్చోండి. మాట్లాడుతూ పని చేసుకోవటం నాకు సరదా" అన్నది కళ్యాణకింకిణి.

అతనికి యింక తప్పలేదు. ఆమె తల దువ్వుకుంటూ వుంటే చూస్తూ కూర్చున్నాడు. ఆమె స్నానంచేసి, ముస్తాబై వచ్చి ముఖానికి స్నో, పౌడరూ రాసుకుంటూ వుంటే చూస్తూ కూర్చున్నాడు. ఆమె వుంగరపు వేలితో నొసట కుంకుమ దిద్దుకోవటం అతని మనసుకి చాలా ఆనందం కలిగించింది. ఆమె బూట్లు వేసుకొని తయారైంది. అలంకరించుకుంటున్నంతసేపూ ఆమె అతనితో యేదో మాట్లాడుతూనే వుంది. అతను ఆమె ప్రశ్నలన్నిటికీ ముక్తసరిగా సమాధానాలు చెపుతూ వచ్చాడు.

"అంత దూరాన్నుంచి నన్ను పిలిపించారు. ఇక్కడ యెవ్వరూ దొరకపోయారా?" అని అడిగింది.

"ఆ పాత్రకు మీరే సరిపోతారు."

"నేను నటించిన నాటకం ఏదన్నా చూశారా?"

"చూడలేదు.

"మరి నేనీ పాత్రకు సరిపోతానని యెలా ఊహించ గలిగారు?"

"పేపర్లో మీ ఫొటో చూశాను. మీరు నటించిన నాటకాల రివ్యూలు కొన్ని చదివాను."

"వాటినిబట్టి నిర్ణంచుకున్నారన్నమాట."

"అవును. నేను పొరపడలేదని మిమ్మలను చూసిం తరువాత నిశ్చయించుకున్నాను."

"ఈ నాటకానికి మొత్తం ఎంత అవుతుందని అంచనా వేశారు?"

"ఎంత అయినా పెడదామనే."

"కలెక్షను ఎంత వస్తుం దనుకున్నారు?"

"ఆ విషయం నేను ఆలోచించలేదు."

"మీరు నష్టపడటం నా కిష్టంలేదు." అన్నది కళ్యాణ కింకిణి. ఆ మాట ఆయన్ను మురిపించటానికి అనలేదు. హృదయపూర్వకంగానే అన్నది. తను వేసిన నాటకానికి నష్టం రావటం ఆమెకు ఇష్టం వుండదు.

రవివర్మ ఏమీ మాట్లాడలేదు.

"ఈ నాటకానికి దేని కెంత ఖర్చు పెట్టదలచారో మీకు అభ్యంతరం లేకపోతే, ముందుగా నాకు చెప్పండి. ఖర్చు పెట్టే విషయంలో నా సలహా తీసుకుంటే నేను చాలా సంతోషిస్తాను."

"అలాగే."

ఇద్దరూ రిహార్సల్‌కి బయలుదేరారు. రిహార్సల్స్ ముమ్మరంగా సాగుతున్నాయి. కథానాయకుడు స్టేజీకి క్రొత్తవాడవటంవల్ల, కళ్యాణికింకిణి ముందు బెరుగ్గా వుంటుంటే హాస్యోక్తులతో, ఆ బెరుకు పోగొట్టి నాటకం బాగా రక్తి కట్టేట్టు చేసింది.

రిహార్సల్స్ మధ్యలో వొక యువతి వచ్చి స్టేజీ ముందు కూర్చుంది. ఆమె వచ్చినప్పటి నుంచీ రవివర్మ ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. అంతకుముందు ఆ సలహా ఈ సలహా చెపుతున్న రవివర్మ మెదలకుండా కూర్చున్నాడు. ఆమె, ప్రక్కన వున్న వారితో నవ్వుతూ పేలుతూ మాట్లాడుతూ కూర్చుంది. రవివర్మకు ఆమె వంకకు చూడటమే భయంగా వున్నట్టు వుంది. కళ్యాణకింకిణికి ఆమె యెవ్వరో తెలుసుకోవాలని ఆతురత కలిగింది. "ఎవ్వరామె?" అని కథానాయకుణ్ణి అడిగింది.

"ఆమె పేరు ఊర్మిళ. ఇంతకుముందు రవివర్మగారి నాటకాల్లో ప్రధాన పాత్రలు ధరిస్తూ వుండేది. రవివర్మగారు ఆమె అంటే చాలా చనువుగా వుంటూ వుండేవారు."

"ఇప్పుడేమయింది?"

"ఇటీవల వారి మధ్య కలతలు ఏర్పడి నట్లున్నాయి."

"మ రెందుకు వచ్చింది?"

"ఆమె వొస్తూనే వుంటుంది; సూటీపోటీగా రవివర్మ గారిని ఏదో అంటూనే వుంటుంది."

"వారు ఊరుకుంటారా?"

"ఆమె మాటలకు ఆయనకు కోపం వొచ్చినట్లే కనుపిస్తుంది. కాని ఆయనకు తెలియకుండానే లోలోపల సంతోషిస్తూ వుంటారు. అదంతా పెద్ద గొడవగా వుంటుంది."

"కొంత మందికి ఆడవాళ్ళతో మాటలు పడటం సరదా," అన్నది కళ్యాణకింకిణి.

"అలాగే కనుపిస్తుంది. ఆమెలేనప్పుడు ఆమెను గురించి చాలా కష్టంగా మాట్లాడుతారు. ఆమె కనుపించినప్పుడు ఏమీ అనరు. పైగా ఆమె మాటలకు కోపంగా వున్నట్లు వుండి, అకస్మాత్తుగా విరగబడి నవ్వుతారు."

అంతలో వొక నూతన వ్యక్తి వచ్చి ఊర్మిళ ప్రక్కన కూర్చున్నాడు.

"ఎవ్వరతను?" అడిగింది కళ్యాణకింకిణి.

"ఆమె భర్త."

"పేరు?"

"తాండవకృష్ణ."

"ఏం చేస్తుంటాడు?"

"ప్రభుత్వ కార్యాలయం యు డి క్లర్కు.

"ఆమె ఏం చేస్తుంటుంది?"

"కార్పొరేషన్లో టైపిస్టు."

"ఆయనకూడా తరచు వస్తుంటాడా?"

"వస్తూంటాడు."

"ఎప్పుడూ ఆమె సూటీపోటీ మాటలు అంటూవుంటే ఆయన ఏమీ అనడా?"

"ఎందుకు అనడు? 'ఆమె అట్లాగే అంటూవుంటుంది. మీరేమీ అనుకోకండి' అంటూ వుంటాడు మధ్య మధ్య. చూసేవాళ్ళకి రవివర్మగారు అతనికి యెక్కువ స్నేహమో, ఆమెకు ఎక్కువ స్నేహమో బోధపడనంతగమ్మత్తుగా వుంటాయి వాళ్ళ సంబంధాలు."

ఊర్మిళ తన్ను పరీక్షగా చూస్తూవుందని గ్రహించి, విజృంభించి రిహార్సల్స్ చేసింది. కళ్యాణకింకిణి రిహార్సల్స్ రవివర్మ ఆశించిందాని కంటే విజయవంతగా ముగిశాయి. కాని అతను రిహార్సల్స్ చూస్తూన్నట్టులేదు. ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

రిహార్సల్స్ అవగానే గబగబా స్టేజీమీదకు వచ్చారు ఊర్మిళ, తాండవ కృష్ణులు.

"చాలా బాగా నటించావమ్మా!" అన్నది ఊర్మిళ.

కళ్యాణకింకిణికి ఆశ్చర్యం వేసింది. ధోరణినిబట్టి-తాను విన్న దానినిబట్టి ఏదో పుల్లవిరుపు మాట అంటుంది, అనుకున్నది. అలాకాక అతిమర్యాదగా అభినందించేప్పటికి కాస్త తబ్బిబ్బు పడి సంబాళించుకోని, "నన్ను సంతోష పెట్టడానికి అంటున్నారు" అన్నది.

"అలా అనకండి. ఊర్మిళ యితరలో ఉన్న గొప్పతనాన్ని వొకపట్టాన వొప్పుకునే మనిషికాదు. ఆమె నిజమే చెప్పింది. మీరు అద్భుతంగా నటించారు" అన్నాడు తాండవ కృష్ణ.

"తీరితే రమ్మన్నాగా."

అలా జరిగిపోయింది భార్యాభర్తలమధ్య సంభాషణ. ఒకక్షణం వొకరిమాట వొకరు జవదాటని వారుగా కనుపిస్తారు; మరుక్షణం అతను కోపగించి మందలిస్తాడు. కాని అతని మాటలకు ఆమె భయపడుతున్నట్లు కనుపించదు. తను అనేమాట అంటూనే వుంటుంది. అంతలో అతను చల్లబడిపోయి, రాజీపడతాడు. వారి సంభాషణ వింటూ యీ భార్యాభర్తల సంబంధం తెగిపోకుండా కాపాడుతున్నది యేమిటా అని ఆలోచించింది కళ్యాణకింకిణి. లారెల్, హార్డీ జంట జ్ఞాపకం వచ్చి తనలో తాను నవ్వుకుంది.

వాళ్ళు వెళ్ళిపోవటానికి ఉద్యుక్తులయ్యారు.

"ఎప్పుడు వస్తారో చెప్పండి" అని అడిగాడు తాండవకృష్ణ, కళ్యాణకింకిణిని.

"నాటకం పూర్తికానివ్వండి" అన్నది కళ్యాణకింకిణి.

"ఎప్పుడన్నారండీ. మా యింటికి రాకుండా మాత్రం తిరిగి వెళ్ళకూడదు."

"అలాగే"

"మీరుకూడా వస్తారుగదూ? అమ్మాయిని వెంట పెట్టుకొని మీరుకూడా రండి" అన్నాడు తాండవకృష్ణ రవివర్మతో.

"నేను రాలేను" అన్నాడు రవివర్మ, చూపులు తప్పుకుంటూ.

"రాకపోతే సరే" అన్నది పూర్ణిమ.

ఆమె మాటకు రవివర్మ చాలా బాధపడుతున్నాడని గ్రహించింది కళ్యాణకింకిణి. వాళ్ళు వెళ్ళిపోగానే ఆమెదగ్గరకు వొచ్చి, "వెళదాం పదండి" అన్నాడు రవివర్మ.

స్టేజీ దాటగానే, "ఇందులో మీరు బాధపడవలసింది యేమీ లేదు" అన్నది కళ్యాణకింకిణి.

"నా బాధ యెలా చెప్పుకునేది?" అన్నాడు రవివర్మ శూన్యంలోకి చూస్తూ. కాసేపు మౌనంగా వుండి, "ఆమెను గురించి మీ ఉద్దేశం యేమిటి?" అని అడిగాడు.

"నేను చూచింది ఇప్పుడేగదా! ఏమని చెప్పగలను?"

"పోనీ అతన్ని గురించి మీ ఉద్దేశం చెప్పండి."

"అతను భ్రష్టుడు. సందేహంలేదు."

ఈ మాటకు ఉలిక్కిపడి చూశాడు రవివర్మ. ఆమె చురుకుతనానికి అతనికి ఆశ్చర్యం వేసింది. అభిమానం కలిగింది.

"నేను ప్రపంచం చాలా చూసినదాన్ని" అన్నది కళ్యాణకింకిణి అతని ఆశ్చర్యానికి చిరునవ్వు నవ్వుతూ.

"మరి ఆమెనుగురించి మీ అభిప్రాయం చెప్పక పోతిరి!"

"వెళ్ళేలోగా చెపుతాను. మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని గురించికూడా నా అభిప్రాయం చెపుతాను."

అతను మాట్లాడలేదు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ కారుదగ్గరకు నడిచాడు. ఇద్దరూ కార్లో హుస్సేన్ సాగర్ వెళ్ళారు.

హుశ్శేన్‌సాగర్ హైదరాబాద్‌కీ సికింద్రాబాదుకి మధ్య ఉంటుంది. హైదరాబాద్‌నుంచి సికింద్రాబాద్ వెళ్ళే రోడ్డు దాని అంచువెంటే వెళ్తుంది. ఆ అంచు హైదరాబాద్, సికింద్రాబాద్ వాస్తవ్యులకి విహారస్థలం. విహారానికి వచ్చిన వారికి, చిన్న చిన్న పార్కులూ సిమెంట్ బెంచీలూ వున్నాయి. అక్కడ వొక బెంచీమీద కూర్చున్నారు కళ్యాణకింకిణి రవి వర్మలు.

హుశ్శేన్‌సాగర్ జలాలమీదనుంచి చల్లనిగాలి వీస్తూ వుంది. కార్లు వచ్చి ఆగుతున్నయి. భార్యాభర్తలూ, ప్రేయసీ ప్రియులూ ఆ కార్లలోనుంచి దిగి జంటలుజంటలుగా నడుస్తున్నారు. కాస్త దూరంలో కూర్చుని గుస గుసలు పోతున్నారు. అప్పుడే విద్యుద్దీపాలు వెలిగినై. ఆ కాంతిలో హుస్సేన్‌సాగర్‌లోని అలలు తళతళ మెరు స్తున్నయ్.

ఉన్నట్టువుండి, "ఈ హుశ్శేన్‌సాగర్ ఎందుకుప్రసిద్ధో మీకు తెలుసా?" అని అడిగాడు రవివర్మ.

"ఎలా తెలుస్తుంది?"

"రోజూ ఎవ్వరో వొక నిరాశాజీవి ఇందులోకి దూకి ఆత్మహత్య చేసుకుంటూవుంటాడు. పోలీసులు అతని శవాన్ని బయటకు తీస్తారు. ఆత్మహత్య చేసుకున్నాడని తీర్పు చెపుతారు. పేపర్లో చదివి అదృష్టవంతులు పెదవి విరుస్తారు. 'చచ్చి ఏమి సాధించదలిచాడో' అంటారు. వొక్కొక్క పరిస్థితిలో ఆత్మహత్య చేసుకోవటం దానంతట అదే

ఆనందాన్నిస్తుందని యెవ్వరికి తెలుస్తుంది?" అని అన్నాడు రవివర్మ.

ఆమె మాట్లాడలేదు. దూరంగా వొక పల్లెవాడు భార్యను తిడుతున్నాడు. ఒక కారు డ్రయివరు బుట్ట నెత్తిన పెట్టుకుపోయే వొక మగనాలితో సరసాలాడుతున్నాడు. 'ఓరి నీ జిమ్మడా' అంటున్నది ఆమె. ఒక కారు హారన్ మోగింది. వొక పిట్ట రెపరెప కొట్టుకుంది.

"ఊర్మిళపట్ల నా ప్రవర్తన మీకు విచిత్రంగా ఉండి వుంటుంది."

"కొంతవరకు" అన్నది కళ్యాణకింకిణి.

"రెండు సంవత్సరాల క్రితంవరకూ నేను ఆమెను ఎరగను. నాకు నాటకాలంటే చిన్నప్పటినుంచీ సరదా. ఆ రోజుల్లో నేను ఒక నాటకం వ్రాసి ప్రదర్శిద్దామనే కుతూహలంతో వున్నాను. కాని ఇక్కడ స్త్రీ పాత్రలు నటించే వారు తక్కువ; అసలు లేరనే చెప్పవచ్చు. వెతికి వెతికి నేను చాలా నిరుత్సాహపడ్డాను. ఊర్మిళకు ఈ సంగతి ఎట్లా తెలిసిందో ఏమో, భర్తతో కలిసి మా యింటికి వచ్చి 'నేను వేస్తాను' అన్నది. 'ఊర్మిళ మీ నాటకంలో వేషం వెయ్యటానికి నాకు ఎటువంటి అభ్యంతరమూ లేదు' అన్నాడామె భర్త—చదువుకున్నవాళ్లు యిలా ముందుకు రావటం నా కప్పుడు చాలా ముచ్చట వేసింది. అందులో వివాహం అయినవాళ్లు!

"నాకు పిల్లలులేరు. అప్పటికే నాభార్య గతించి

నాలుగేండ్లయింది. ఆమె మహా ఇల్లాలు, ఆమెనుగురించి వ్రాసిన నాటకమే ఇది. ఆ నాటకం ప్రదర్శించటానికి అవకాశం దొరకని నాకు, ఊర్మిళ వొచ్చి నేను స్త్రీపాత్రను ధరిస్తాననేటప్పటికి కొండ ఎక్కినంత పనయింది. ఆమెమీద నాకు సొంత కుతురుమీద వుండేదానికంటే యెక్కువ వాత్సల్యం ఏర్పడింది. నాటక ప్రదర్శన పూర్తిఅయింది. నలుగురూ మెచ్చుకున్నారు. ఊర్మిళ బాగా నటించిందనే అనుకున్నాను.

ఆనాటినుంచీ నాకు ఆమెతో పరిచయం ఎక్కువ అయింది. ఆమెపట్ల నాలో అంకురించిన వాత్సల్యం దిన దిన ప్రవర్ధమానం కాజొచ్చింది. ఆమెను ఒక్కరోజు చూడక పోతే నాకు ఎట్లాగో ఉండేది. నేను కనుపించకపోతే తాండవ కృష్ణ మా యింటికి వచ్చి తీసుకువెళ్ళేవాడు. కాని రాను రానూ, వాళ్ళనిగురించి అనేక సంగతులు తెలిసినై" అని ఒక పెద్ద నిట్టూర్పు విడిచి, "మిమ్మల్ని తమ ఇంటికిరమ్మని వాళ్ళు ఆహ్వానించారు, మీకొక సలహా చెప్పదలిచాను. మీరు వెళ్ళకండి" అన్నాడు.

"ఆ సంగతి నెమ్మదిగా ఆలోచిద్దాం. కాని మీకూ ఊర్మిళకూ మనస్పర్ధ ఎందుకు వొచ్చింది?" అని అడిగింది కళ్యాణకింకిణి.

రవివర్మ చాలాసేపు మాట్లాడలేదు. ఎలా మొదలు పెట్టాలో తెలియక బాధపడుతున్నాడని గ్రహించి కళ్యాణ కింకిణికూడా మెదలకుండా కూర్చుంది. చివరకి రవివర్మ ఇలా అన్నాడు:

"ఊర్మిళ మంచిదనీ, నిష్కల్మషమైన మనస్సు గలదనీ, నేనంటే ఎంతో గౌరవమూ—అభిమానమూ అనీ నేను అనుకుంటూ వచ్చాను. ఆమే అలాగే ప్రవర్తించేది. కాని తరువాత నా ఉద్దేశం మారింది."

"ఎందుకని?"

"అంతకుముందు కొద్దిరోజులనుంచీ నేనంటే ముభావంగా వుంటూ వచ్చింది ఊర్మిళ. లేనిపోయింది నేనేఊహించుకుంటున్నా నేమో—అని నన్ను నేనే సర్దుకుంటూ వచ్చాను. ఒకరోజు నేను వెళ్ళేటప్పటికి ఒకకుర్రవాడు ఆమెతో వున్నాడు. అతను ఇక్కడ కాలేజి స్టూడెంటు. ఒక జాగీర్దారు కొడుకు. వాళ్ళ వైఖరిచూస్తే నాకు అనుమానం వేసింది. బాకుపెట్టి గుండెల్లో పొడిచి నట్లయింది. ఇంట్లోకి అడుగు పెట్టలేక బయటనుంచే తిరిగి వొచ్చివేశాను. నా మనస్సు పరిపరి విధాల ఆలోచించింది. తరువాత ఇంకా చాలా సంగతులు తెలిసినై. ఇక ఉండబట్టలేక ఒక రోజు ఆమె ఇంటికివస్తే అడిగాను. ఆమె ఇంత ఎత్తున లేచింది. నానా దుర్భాషలూ ఆడింది. చివరికి 'చేసుకున్న వాడికి లేని అనుమానాలు నీకెందుకు?' అని అడిగింది..."

అంతవరకు చెప్పి, ఆయన ఇక ఆపివేశాడు. కళ్యాణకింకిణి కాసేపు ఆలోచిస్తూ కూర్చొని, "అప్పటినుంచీ ఆమెతో సరిగ్గావుండటం లేదన్నమాట!" అన్నది.

"అవును, కాని తరువాత నాకు తెలిసిన సంగతులు మీతో చెప్పాలని వుందిగాని, చెప్పలేను."

"మరి ఇప్పటికీ మీరంటే ఆమెకు ఇష్టమే నే!"

"లేదు. ఇందాక ఆమె మాట్లాడటం విన్నారుగా!"

"ఇష్టంలేకపోతే మిమ్మల్ని అంతగా బాధ పెట్టే విధంగా మాట్లాడ వలసిన అవసరం లేదు. అసలు ఏదో ఒక విధంగా అయితేమాత్రం-మీతో మాట్లాడవలసిన అవసరం ఏముంది?"

"అవసరం వుంది."

"ఏమిటి?"

"ఆమెకు, ఆమెకంటే అతనికీ డబ్బు కావాలి."

"మరొక సంగతి..."

అతను ఆమె ముఖంలోకి పరీక్షగా చూశాడు.

"మీకుకూడా ఆమె అంటే ఇంకా ఇష్టమే!"

ఈ మాటకు అతను కంగారు పడ్డాడు. అతని శరీరం వొణికింది; "పొరపాటు... వొట్టిది. మీరు పొరపాటు పడుతున్నారు" అన్నాడు.

"వొట్టిదైతే ఓ సంగతి అడుగుతాను చెప్పండి. మీరు ఊర్మిళను ఒక కుర్రవాడు ప్రేమించినట్లు ప్రేమించ లేదుగదా! ఒకవేళ ఆమె ఒక కుర్రవాణ్ణి ప్రేమించినా, ఇంకా అంత కంటే నీచంగా ప్రవర్తించినా మీ రింతగా బాధపడటం దేనికి? మీ పిల్లలు తప్పుచేస్తే క్షమించరూ? అలాగే ఆమెను కూడా క్షమించి వుండవచ్చుగా! పోనీ అంతగా ఆమె అంటే అయిష్టత ఏర్పడితే, నన్ను పలకరించవలసిన అవుసరం లేదని అతనితోనూ, ఆమెతోనూ ఖచ్చితంగా చెప్పివెయ్య వచ్చుగా! అలా చెప్పితే, అవి హృదయపూర్వకంగా చెప్పిన

మాటలని నమ్మితే ఏ స్త్రీ అయినా మీతో జోక్యం పెట్టుకుంటుందని నేను అనుకోను. పైకి ఎన్నన్నా లోపల తనంటే మీకు యిష్టమని ఆమెకు తెలుసు, అందుకనే అలా ప్రవర్తిస్తూవుంది. ఆలోచించుకు చూడండి; మీ బాధకు మీరే కారణం—ఇంకెవ్వరూ కాదు. ఆమెపట్ల మీకున్న వాత్సల్యంలో యెక్కడో మలినం లేకపోతే కథ యిట్లా నడవవలసిన అవసరం లేదు."

ఆమె ఈ విషయాలన్నీ అతనికి చెబుదాం అనుకోలేదు. తన మనస్సులో సంభాషణ ఇన్ని విషయాలను రేపిందని బయట పెట్టేదాకా ఆమెకు తెలియదు. మొదలు పెట్టింతరువాత ఆగలేదు. ఒక దాని పిదప ఒకటి అలా తరంగాల్లాగా నెట్టుకుంటూ వొచ్చివేసినై.

రవివర్మ వింటూ కూర్చున్నాడు, ఏమీ మాట్లాడలేదు. శిలాప్రతిమలా కదలకుండా కూర్చున్నాడు. చూపులు అక్కడ లేవు. ఏదో నాటకంలో నటించటానికి వచ్చిన తాను యింత లోతుకుదిగి మాట్లాడినందుకు ఆమె పశ్చాత్తాపపడింది. కాని ఇప్పుడు ఏం చేసేటట్టు? అతనితో పాటు తనూ కదలకుండా కూర్చుంది. చూచినప్పటి నుంచీ రవివర్మ పట్ల ఆమెకు సానుభూతి ఏర్పడివుంది. ఇప్పుడు విపరీతమైన జాలి పుట్టింది, కుములుతూ కూర్చున్న అతన్ని చూసేటప్పటికి.

వాళ్ళముందుగా ఒక జంట కిలకిలా నవ్వుకుంటూ నడుస్తూవుంది. పక్కనున్న పూలపందిరి పువ్వులను రాల్చింది. ఆకాశాన్ని మబ్బులు అలుముకుంటున్నాయి. దూరాన

వున్న కొండలపంక్తి హెచ్చుతగ్గులు చీకటిలో కరిగి పోతున్నాయి.

రవివర్మకు లేవాలనే తలపే కలగలేదు. కళ్యాణకింకిణి అతనిని కదల్చదలచలేదు; అలాగే ఆ సిమెంట్ బెంచీ మీద కూర్చుని వున్నారు. వాళ్ళను చూస్తోంటే హుశ్శేన్ సాగర్‌కి దురాశ కలిగింది.

♦ ♦ ♦

నాటకం దిగ్విజయంగా పూర్తయింది. డబ్బును తన చేతుల్లోకి తీసుకొని కళ్యాణకింకిణి వాడటంవల్ల అన్నిఖర్చులూ పోను అయిదువందల రూపాయలు మిగిలినై. రవివర్మ సంతోషానికి మేరలేదు. ఆమె నటనా చాతుర్యానికి ముగ్ధుడై ఆమెను యివ్వవలసిన డబ్బుతోపాటు, బంగారుపూతపూసిన నటరాజ విగ్రహాన్ని బహూకరించాడు.

నాటకం పూర్తి అవగానే ఊర్మిళా తాండవకృష్ణులు స్టేజమీదకువచ్చి ఆమెను అభినందించారు. ఊర్మిళ ఆమెను కావలించుకొని ఉప్పొంగిపోయి, తన్ను తాను మరచినట్లు మాట్లాడింది. ఆ క్షణం ఊర్మిళమీద అమితానురాగం కలిగింది కళ్యాణకింకిణికి.

"ఇంటికి ఎప్పుడు తిరిగి వెళ్తారు?" అని అడిగింది ఊర్మిళ.

"రేపు ఉదయం ఎలాగూ వెళ్ళలేను. రేపు రాత్రికి వెళ్తాను" అన్నది కళ్యాణకింకిణి.

"రేపు ఉదయం మా యింటికి డిన్నరుకి రండి."

"అలాగే."

"మరచిపోగూడదు" అన్నాడు తాండవకృష్ణ.

"తప్పకుండా వస్తాను"

"నేను వచ్చి మిమ్మల్ని తీసుకు వెళతాను."

"అలాగే."

తరువాత తాండవకృష్ణ రవివర్మను ఆహ్వానించాడు. ఊర్మిళకూడా తన ధోరణిలో తాను అడిగింది. కాని అతను ఒప్పుకోలేదు. తన సహజ ధోరణిలో కాక రానని గట్టిగా చెప్పాడు. అతని సమాధానంలోని కర్కశత్వానికి ఊర్మిళ ఉలిక్కిపడి చూచింది. ఏమీ అనలేకపోయింది. తాండవకృష్ణ ఇవేమీ గమనించినట్లులేదు.

"అలా అంటారుగాని సమయానికి వస్తార్లే ఊర్మిళా!" అన్నాడు చాలా తెలివిగా మాట్లాడుతున్నా ననుకొని తనలో తాను నవ్వుకుంటూ.

"చెప్పేది నీకా్కదా, తాండవకృష్ణా! నేను రానం టున్నాను" అన్నాడు రవివర్మ.

తాండవకృష్ణ ఇంతంతకళ్ళుచేసుకుచూశాడు, రవివర్మని.

ఆ క్షణం రవివర్మని చూచి తాండవకృష్ణ భయపడ్డా డని అనిపించింది కళ్యాణకింకిణికి.

"రానంటూ వుంటే యెందుకు_ఆయన్ని ఇబ్బంది పెడ తావ్?" అన్నది ఊర్మిళ.

తాండవకృష్ణ ఇక మాట్లాడలేదు. వారు వెళ్ళింతరు వాత, "మీరు వెళ్ళకుండా వుంటేనే మంచిదని నా అభి ప్రాయం" అన్నాడు రవివర్మ.

"ఎందుకని?"

"వారు మీ స్నేహానికి అర్హులుకారు."

"ఏం?"

"అన్ని సంగతులూ నేనుమీకు చెప్పలేకపోతున్నాను. ఒకప్పుడు నేను వాళ్ళవి ఆదర్శ దాంపత్యం – అనుకున్నాను. ఆమె సుగుణాలరాశి—అనుకున్నాను. వాళ్ళని గురించి కొన్ని సంగతులు చెప్పటానికి నోరాడకుండావుంది."

"నా అంత నన్ను తెలుసుకోనివ్వండి!"

మరునాడు ఉదయం తాండవకృష్ణ వచ్చి ఆమెను తీసుకువెళ్ళాడు.

తాండవకృష్ణ యిల్లు చార్మినార్ దగ్గర వుంది. హైదరాబాదు, మూసీనది యిటు పెరగకముందు కాపలాదార్లు దూరంగా వస్తున్నవారిని కనిపెట్టటానికి పూర్వపు సుల్తానులు దీనిని కట్టించారని ప్రతీతి. ఇది వొక గాలిగోపురంలా గుంటుంది. దీనికి కుడిచేతి వైపున జల్తారు బట్టలూ, జల్తారు టోపీలు, గాజులూ మొదలైన పూర్వసంస్కృతికి సంబంధించిన వస్తుసామగ్రిని అమ్మే దుకాణాల బజారు ఒకటి వుంది. దానిని దాటితే ఎడమచేతి వైపున క్రొత్తగా నిర్మించబడిన యిండ్లు కొన్నివున్నయ్. అక్కడ ఒక డాబా అద్దెకు తీసుకొని కాపురం వుంటున్నాడు తాండవకృష్ణ.

ఇల్లు పెద్దది. కొంగ్రొత్త బొమ్మలతో, ఫర్నిచర్‌తో చక్కగా అలంకరించబడి వుంది. చూడగానే మంచి ఆర్టిస్టిక్ టేస్టు వున్నవాళ్ళు నివసిస్తున్నారు_అనిపిస్తుంది. దేశం అంతా

తిరిగివచ్చిన కళ్యాణకింకిణే ఆ ఇల్లు అలంకరించబడిన విధానం చూచి ముచ్చటపడింది. వాళ్ళకు వంటకు ఒక వంటవాడు కూడా వున్నాడు.

భోజనాలైనై. భోజనానికి రవివర్మ ఉదహరించిన జాగీర్దారు కుమారుడుకూడా ఆహ్వానించబడ్డాడు. అతః ని తాండవకృష్ణే తీసుకొచ్చాడు. ఆ కుర్రవాని పేరు కుర్షీద్. కుర్షీద్ వస్తూ రకరకాల స్వీట్సూ, పండ్లూ పట్టుకువచ్చాడు. రకరకాల పువ్వులతో కూర్చబడిన రెండు పెద్ద బొకేస్‌లు పట్టుకువచ్చి ఒకటి ఊర్మిళకూ, ఒకటి కళ్యాణకింకిణికీ బహూకరించాడు.

కుర్షీద్‌ని కళ్యాణకింకిణికి పరిచయం చేస్తూ, "ఇతనికి ఊర్మిళ అంటే చాలా ఇష్టం. ఊర్మిళ క్రింద నడిస్తే ఎక్కడ అరిగిపోతుందో అని అ స్త్రమానం భయపడుతూవుంటాడు. నేను ఊర్మిళకు తగిన భర్తను కానని కూడా అతని అభిప్రాయం. ఊర్మిళ చేతిన ఉన్న ఆ వజ్రపుటుంగరం ఆమె బర్త్‌డేనాడు అతను ప్రెజెంట్ చేసిందే" అన్నాడు తాండవకృష్ణ.

నిజంగానే ఆ కుర్రవాడికి ఊర్మిళ అంటే తగని ప్రేమ అని కళ్యాణకింకిణి, పరిచయం అయిన కొద్దిసేపటికే గ్రహించింది. ఆ కుర్రవాడు ఉన్నంతసేపూ ఊర్మిళను కళ్ళు అప్పగించి చూస్తూ కూర్చున్నాడు. చూస్తున్నంతసేపూ పెదిమల మీద చిరునవ్వు తాండవిస్తూనే వుంది. ఆమెను ఏపనీ చెయ్యనివ్వడు; అసలు లేవనివ్వడు. ఆమె చెయ్యవలసినవన్నీ తానే చేస్తాడు, ఆమెకు కావలసినవన్నీ తానే అందిస్తాడు. ఆమె

పెదవులనుంచి బయటకు వొచ్చే ప్రతిమాటకు ముసిముసి నువ్వులు వొలకబోస్తాడు. ఆమెకూడా అతన్ని చూపులతో, చిరునవ్వులతో, చిలిపి మాటలతో వున్నంతసేపూ రెచ్చగొడుతూనే వుంది.

"కుర్షీద్! ఇప్పుడు నేను చచ్చిపోతాననుకో - ఏం చేస్తావు?" అని అడిగింది.

ఈ ప్రశ్నకు అతని ముఖం కుమిలిపోయింది. కళ్ళు అప్రయత్నంగా చెమ్మగిల్లినై. "నవ్వులాటకుకూడా అటువంటి మాట అనకు ఊర్మిళా. ఇంకెప్పుడూ ఇటువంటి మాట అనని ప్రామిస్ చెయ్యి" అన్నాడు ప్రార్థనాపూర్వకంగా.

"అనను లే" అన్నది ఊర్మిళ.

కాసేపు వుండి, "ఒకవేళ తాండవకృష్ణగారు నన్ను ఇంట్లోనుంచి వెళ్ళగొడతా రనుకో - అప్పుడేంచేస్తావు?" అని అడిగింది.

"ఆయనను అభినందన పరంపరలతో ముంచెత్తుతాను" అన్నాడు కుర్షీద్ చాలా సీరియస్‌గా.

ఇవన్నీ వింటూ అప్పుడప్పుడూ బిగ్గరగా నవ్వుతూ కూర్చున్నాడు తాండవకృష్ణ. ఇటువంటి దృశ్యాల్లో అతను అనుభవించే ఆనందం ఏమిటో కళ్యాణకింకిణికి అర్థంకాలేదు. కాని వాతావరణం కిటుకు అతనిలోనే ఉందని మాత్రం గ్రహించింది.

భోజనం చెయ్యగానే టీ త్రాగటం హైదరాబాద్ మహామ్మదీయులకు అలవాటు. ఆ అలవాటు ఊర్మి

శకూ తాండవకృష్ణకీకూడా ఉంది. అలాగే అందరూ భోజ నాలు ముగించుకొని కూర్చుని టీ త్రాగారు. టీ త్రాగిన దగ్గరనుంచీ ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చున్నాడు కుర్షీద్.

"మాకు కొద్దిగా పనుంది, ఒక్క అరగంటలో తిరిగి వస్తాం, మీరు మాట్లాడుకుంటూ వుండండి" అర్థయుతంగా నవ్వుతూ లేచింది ఊర్మిళ.

వారు బయటకు వెళ్ళగానే "ఆ కొద్దిపని ఏమిటో తెలుసా?" అని చిరునవ్వుతో అడిగాడు తాండవకృష్ణ.

"చెప్పండి" అన్నది కళ్యాణకింకిణి.

"వాళ్ళు కాలక్షేపానికి హోటల్లో ఒకగది తీసు కున్నారు. అ క్కడికి వెళ్తున్నారు" అన్నాడు.

జీవితంలో ఎన్నో అనుభవాలను గడించిన కళ్యాణ కింకిణికి కూడా ఈ మాట ఏవగింపును కలిగించింది. 'ఈ త్రాష్టుడు భర్త ఎట్లా అయ్యాడు!' అని తనలో తాను ఆశ్చర్యపడింది.

అతను తన తెలివికి తానే సంతోషించుకుంటూ, భుజాలు ఎగరవేసుకుంటూ చెప్పుకుపోయాడు; "భార్యని భర్తా, భర్తని భార్యా అదుపులో ఉంచటం, ఒకరికోసం ఒకరు బ్రతకటం, ఒకరితో ఒకరు ముడిపెట్టుకోవటం, వేరు ముఖాలను చూడకపోవటం మొదలైన భావాలు మాకు గిట్టవు. మేమిద్దరం స్వాతంత్ర్య ప్రియులం. ఎవ్వరి స్వాతంత్ర్యం వారిదే; ఎవ్వరి జీవితం వారిదే. భార్యా

భర్తలం అయినంత మాత్రాన ఒకరి స్వాతంత్ర్యం ఒకరం చంపుకోవాలని ఎక్కడుంది? పైగా ఒకరి ఆపేక్షలు తీర్చుకోటానికి ఒకరం సహాయపడాలి; తోడ్పడాలి. ఆ అపేక్షలు ఎటువంటివైనా సరే. ఇప్పుడు ఊర్మిళ అటువంటి పనేచేసింది. తను కుర్షీద్‌తో కాలక్షేపం చెయ్యాలనే కాక, మనకు ఏకాంతం కలిగించాలనే ఉద్దేశంతో బయటకు వెళ్ళింది" అని కళ్యాకింకిణి కన్నులలోకి చూచి చిరునవ్వు నవ్వాడు.

కళ్యాణకింకిణికి ఆ అనుమానం లేకపోలేదు. ఆత్మ విశ్వాసం కలిగిన మనిషి గనుక అంతు తేల్చుకుందామని కూర్చుంది. అతని మాటలకు 'బుద్ధి వక్రించిందిగాని తెలివి గల చచ్చినాడే' అని మనస్సులో అనుకొని పైకి "నాకొక విషయం అడగాలనివుంది" అన్నది.

"అడుగు?" అన్నాడు తాండవకృష్ణ. ఏకవచన ప్రయోగం ఆమెగమనించి 'నేర్పుగల చచ్చినాడుకూడాను' అనుకున్నది మనస్సులో.

"ఊర్మిళ, కుర్షీద్‌తో అలా తిరుగుతుంటే మీకు బాధగా, అసూయగా వుండదూ?" అని అడిగింది పైకి.

"బాధా, అసూయా ఎందుకు? దేనికోసం? ఆ మాటకు వస్తే, 'కుర్షీద్‌మీద నాకు మనస్సుగా వుంది' అని ఊర్మిళ చెప్పగానే నా తెలివంతా ఉపయోగించి వాళ్ళకు స్నేహం నేనే కలిపాను. నాకు ఎందుకనో ఊర్మిళ మరొకరితో మనస్ఫూర్తిగా స్నేహంచేస్తే చాలా సంతోషంగా వుంటుంది. కుర్షీద్ అంటే నాకిప్పుడు అపరిమితమైన ప్రేమ.

ఊర్మిళ అయినా అతన్ని చూడకుండా వుండగలదు గాని నేను వుండలేను."

"మీపట్ల ఊర్మిళకూడా అదే విధంగా వుండగలుగుతుందా?" అని అమాయికత నటిస్తూ అడిగింది కళ్యాణకింకిణి. "చూస్తూనే అడుగుతావేం?" అన్నాడు తాండవకృష్ణ ఆమెను క్రీగంటచూస్తూ. "మొదట్లో నాకున్నంత సంస్కారం వుండేదిగాదు ఊర్మిళకు. నేను జమీందారు కుటుంబంలో పుట్టినవాణ్ణి మా ముత్తాత ఆంధ్రదేశంలోని పెద్ద జమీందారుల్లో వొకరు. వారితండ్రి మహమ్మదీయుల సైన్యంలో ఒక దళాధిపతిగా పనిచేసి, వారి మన్ననలను పొంది జమీ సంపాదించారుట. మాతండ్రి హయాం వచ్చేటప్పటికి మా ఆస్తి చప్పగా పోయిందనుకో. అది వేరే సంగతి. మాతండ్రి గారి వరకూ మావంశంలో వొక్కొక్కరూ ఒక అరడజను భార్యలనైనా పొందివుండటం ఆచారంగా వుండేది; ఘనతగా వుండేది. ఉంపుడుగత్తెల సంగతి నీకు చెప్పనవసరం లేదనుకుంటాను, నువ్వు ఊహించుకోవచ్చు. అటువంటికుటుంబంలో పుట్టటంవల్లో నిజస్వభావంవల్లో స్త్రీ పురుష సంబంధాల్ని గురించి నా అభిప్రాయాలు మొదటినుంచీ వేరుగానే వుంటూ వుండేవి. ప్రేమ, ఒకేవ్యక్తి వొకేవ్యక్తిని నమ్మి అంటిపెట్టుకొని వుండటం, ఇవన్నీ చాలా మోటు భావాలు. పెళ్ళి అయిన మొదట్లో ఈ విషయాలన్నీ నేను ఊర్మిళతో చర్చించాను. ఆమె మొదట్లో అర్థం చేసుకోలేదు. అర్థంచేసుకోలేదంటే తెలివితక్కువ వల్లకాదు. ఆమె మధ్య తరగతి

కుటుంబంలో పుట్టటంవల్ల. మధ్యతరగతికి చెందిన అర్థంలేని అనాగరిక అలవాట్లకు ఆమె అప్పుడు బానిసగా ఉండేది. కాని క్రమక్రమేణా నా నాగరిక దృష్టిలోవున్న సొగసూ, సౌలభ్యం, ఆనందం ఆమె గ్రహించ గలిగింది. ఇక ఇప్పుడా?" అని పెద్దపెట్టున నవ్వి, "నేను ఏస్త్రీనయినా మనస్సులో కోరుకుంటేచాలు, మరుక్షణం ఆస్త్రీ నా స్వాధీనంలో వుండేటట్లు ఎంత చాకచక్యంగా ఏర్పాటు చేస్తుందనుకున్నావు!" అన్నాడు చప్పరిస్తూ.

'ఓరి ఛండాలుడా, భగవంతుడు నిన్ను ఎట్లా పుట్టించాడురా.' అనుకుంది కళ్యాణకింకిణి మనస్సులో. పైకి, "ఊర్మిళా, రవివర్మగారూ ఇటీవల వరకూ చాలాచనువుగా వుండేవారని విన్నాను. అటువంటివారికి ఎందుకు మనస్పర్థ వొచ్చినట్లు?" అని అడిగింది.

"ఆ రవివర్మ వొట్టి చాదస్తుడు, అనాగరికుడు, మూర్ఖుడు. అన్నిటా తాతలనాటి బూజు భావాలను పట్టుకొని వ్రేళ్ళాడుతూ వుంటాడు. అలాంటివాడని నాకు ముందే తెలిస్తే వూర్మిళను దూరంగా ఉంచేవాణ్ణి. మా సిద్ధాంతంలో వున్న సౌలభ్యం, హాయీ మాతో పరిచయం అయిన తరువాత అయినా అనుభవంలోకి తెచ్చుకొని మారకపోతాడా - అనుకున్నాను. నేను అనుకున్న దానికి అంతా విరుద్ధంగాజరిగింది. పానకంలో పుడకలా తయారయ్యాడు."

'నీబొంద' అని మనస్సులో అనుకొని పైకి, "అసలు ఏం జరిగిందేమిటె!" అని అడిగింది కళ్యాణకింకిణి.

ఊర్మిళ నాటకాల్లో వేషాలు వెయ్యటం అంటే మొదటినుంచి చెవికోసుకునేది. రవివర్మ ఒక నాటకం వ్రాసి ప్రదర్శించదలచుకున్నాడని తెలిసి, అతనితో పరిచయం చేసుకోవాలని ఉబలాటపడింది. నేను అప్పటికీ 'ఆ ఏభయ్యో పడిలో పడిన వాడితో మనకెందుకు' అని చెప్పాను. ఆమె నామాట వినలేదు. పైగా ఆ వయస్సులో వున్నవాళ్ళే నిర పాయులు – అన్నది. కుర్రవాళ్ళయితే జరిగిన సంగతులన్నీ బయటకు వెళ్ళి గొప్పలు చెప్పుకుంటారన్నది. వయస్సు మళ్ళిన వాళ్ళయితే ఏంజరిగినా, పడితే తాము బాధపడతా రేగాని, ఇతరులకు చెప్పుకోరు–అన్నది. అప్పటికది బాగానే వుందనిపించింది నాకు. వెంటనే ఇద్దరికీ పరిచయం చేశాను. ఆయన బిడియ పడుతుంటే, మొదటిరోజుల్లో నేనే వెళ్ళి తీసుకు వచ్చాను. వూర్మిళఅంటే విపరీతమైన ఇష్టంకలిగేటట్లుచేశాను. ఇన్నీచేస్తే ఆమూర్ఖుడు ఏంచేశాడనుకున్నావు? వూర్మిళను తన కూతుర్ని చూచినట్లు చూడటం మొదలు పెట్టాడు. వూర్మిళ మొదట్లో నాటకాల్లో వేషాలు వెయ్యటానికి అతనితో పరిచయం చేసుకున్నా, క్రమక్రమేణా అతనిపట్ల గాఢమైన ప్రేమను వృద్ధి చేసుకుంది. అది తప్పని నేను మొదట నుంచీ చెపుతూనేవున్నా, కాని నామాట విన్నది కాదు. అతడు తనను కూతురుగా చూస్తుంటే ప్రథ మంలో ఆమెకు బాగానేవుండేది. కాని రోజులు గడిచినకొద్దీ ఊపిరి సలపని పరిస్థితికి వచ్చింది. అతను వచ్చి వెళ్ళగానే చిర్రులుబుర్రులాడుతూ వుండేది. సహజంగావుండే అపేక్షలను సహజంగా తీర్చుకోలేకపోతే ఏమవుతుంది మరి? అప్పుడప్పుడు

ఆమె తన ప్రేమను వ్యక్తపరచినా, అతను దానిని చిన్న పిల్లల చేష్టలక్రింద జమకట్టి నవ్వుకొని ఆనందిస్తూవుండేవాడు. ఆ రోజుల్లో ఆమె కుర్షిద్‌ని చూచింది. ఇదీ ఒకందుకు మంచిదే నని, నేను వారి పరిచయం వృద్ధి అవటానికి తోడ్ప డ్డాను. కాని ఇప్పటికీ రవివర్మ అంటే ఆమెకు ఇష్టమే, కంప రమే. అందుకనే అతను కనుపించగానే ఆమె అంత అడ్డు దిడ్డుగా మాట్లాడుతూ వుంటుంది. అతను అసలు కారణం గ్రహించి ఆమెకు దూరం అవుతూ వచ్చాడు. పూర్తిగా దూరం అయ్యాడు. విశాలబుద్ధిలేని సంకుచిత స్వభావం గల స్వార్థపరుడికి మా ప్రవర్తన విచిత్రంగానూ, నీతిబాహ్యం గానూ కనపడటంలో నేను ఆశ్చర్యపడను."

'నీ విశాలబుద్ధి తగలబడ్డట్టేవుంది.' అనుకుంది మన స్సులో కళ్యాణకింకిణి. పైకి ఏదో అనబోయేటప్పటికి వంట వాను భోజనం ముగించుకొని వచ్చాడు. వాడు 'ఇంటికివెళ్ళి వస్తాను' అన్నాడు.

"ఏదో పనివున్నది అన్నావుగదా! ఆ పనిపూర్తి చేసుకొని రా," అని చెప్పి అతనికి అయిదురూపాయలు ఇచ్చాడు తాండవకృష్ణ.

"రాత్రి వంటవేళకుగాని రాను" అన్నాడు వంట వాడు డబ్బు తీసుకుంటూ.

"పని మధ్యలో విడిచిపెట్టి రాకు. ఆలస్యం ఐనా పూర్తి చేసుకుని రా."

"దొడ్డితలుపు లోపల గడియ వేశాను, మేకలు రాకుండా ముందు తలుపు మీరు వేసుకోండి" అని చెప్పి

వంటవాడు వెళ్ళిపోయాడు. తాండవ కృష్ణ బిగ్గరగా నవ్వుతూ "ఎప్పుడు వెళ్ళాలో, ఎప్పుడు రావాలో వాడికి పూర్తిగా తెలుసు." అన్నాడు.

ఇక ఆ యింట్లో మిగిలింది కళ్యాణకింకిణి, తాండవ కృష్ణా మాత్రమే. కళ్యాణకింకిణి తెలుసుకో దలచిందంతా తెలుసుకుంది. ఎంత త్వరగా ఆ గుహలోనుంచి బయటపడితే అంత మంచిదని భావిస్తూ, అవకాశంకోసం వెదుకుతూ కూర్చుంది.

"ఈ పూట ఎందుకనో తల నాదుగా వుంది. అబ్బా, తల బ్రద్దలుగొట్టుకు పోతూవుంది" అన్నాడు తాండవ కృష్ణ.

ఒక్క క్షణం అతనిమాటలు నమ్మింది కళ్యాణకింకిణి; "వంటవానితో సారిడాన్ బిళ్ళలు తెప్పిస్తే బాగుండేది;" అన్నది.

"అక్కరలేదు, కాసేపు విశ్రాంతి తీసుకుంటే అదే తగ్గుతుంది" అని చెప్పి ముందుతలుపు వేసి పడక గదిలో పడుకున్నాడు తాండవకృష్ణ.

ఏం చెయ్యటానికీ తోచక అలాగే కూర్చుంది కళ్యాణ కింకిణి. ఆమె మనస్సులో ఏదో అనుమానం లీలగా పొడ చూపి, రూపం ధరిస్తూవుంది. ఆమె క్రిందిపెదవి వొణికింది. అంతలో "ఒకసారి గదిలోకి రా కళ్యాణకింకిణి! ఈ తలనొప్పి భరించలేకండా వున్నాను. నీ మృదువైన వ్రేళ్ళతో

ఒత్తితే యేమన్నా తగ్గుతుందేమో!" అన్నాడు తాండవ కృష్ణ గదిలోనుంచి.

'ఓరి చటకారి వెధవా, ఎన్ని విద్యలు వున్నాయిరా నీ దగ్గర!' అని మనస్సులో అనుకొని, పైకి 'ఒస్తున్నా' అని చెప్పి, నెమ్మదిగా లేచి ముందు తలుపు గడియతీసుకొని బయట పడింది కళ్యాణకింకిణి. తాండవకృష్ణ కళ్యాణి వస్తున్నదని తలనొప్పి నటిస్తూ మూలుగుతూ, ఆపసోపాలు పడుతూ మధ్యమధ్య తలుపువంకకు క్రీగంటచూస్తూ గదిలోనే పడుకుని వున్నాడు.

♦ ♦ ♦ ♦

ఆమెకోసం కనిపెట్టుకు కూర్చున్నాడు రవివర్మ. ఆమె రాగానే ఆమె ముఖాన్ని ఆతురతగా పరీక్షగా చూశాడు.

"మీరు కంగారుపడవలసింది యేమీలేదు. ఎలా వెళ్ళానో, అలా వచ్చాను."

"ఏమిటి సంగతులు?"

"వాళ్ళని గురించి నాతో చెప్పలేక మీరు ఆపుకున్న విషయాలన్నీ నిజమే—అని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను, అయితే మీకొక సలహా చెప్పవలసి వుంది?"

ప్రశ్నార్థకంగా చూశాడు రవివర్మ.

"మీరు వాళ్ళతో యెటువంటి సంబంధం పెట్టుకోకండి. వాళ్ళను గురించి పూర్తిగా మరచిపోండి. మీ నీడను నిలబడటానికి కూడా అర్హత లేనివాళ్ళు, వాళ్ళు. ఏదో ఒక నెపంతో మిమ్మల్ని కలుస్తూ మీ మనస్సు కష్టపడేటట్లు పుల్ల విరుపు మాటలు మాట్లాడే యోగ్యత ఊర్మిళకు లేదు. ఎన్ని

జన్మలు ఎత్తినా రాదుకూడాను. వాళ్లు పతితులని తెలిసి వాళ్ళను మరచిపోలేక పోయినా, వాళ్ళను సహించినా, ఊర్మిళపట్ల మీకున్న అనురాగంలో, వాత్సల్యంలో ఎక్కడో మలినం, స్వార్థచింతనా దాగి వుందని అనుకోవలసివస్తుంది. మీరు పెద్దవారు. మీ మనస్సును మీరు పరీక్షించుకోగలరు. నేను అంతకంటే మీకు యెక్కువగా చెప్పగలిగినదాన్ని కాదు; ఇంతకంటే విడమరచి చెప్పలేనుకూడా."

రవివర్మ తలవంచుకొని ఉపాధ్యాయుని బోధలు చెవిని వేసుకుంటున్న పిల్లవానివలె ఆమెమాటలు విన్నాడు. అతని మనసులో జరుగుతున్న ఘర్షణ ప్రభావం ముఖంలో స్పష్టంగా గోచరమవుతూంది. "మీతో పరిచయం అవటం నా అదృష్టం. మీతో పరిచయం అయిన గడియను జన్మాంతం వరకూ మరచిపోలేను," అన్నాడు.

♦ ♦ ♦

రవివర్మ తనకు కలిగిన తొలి పరిచయాన్ని గురించి ఆలోచిస్తూ మంచంమీద కూర్చున్న కళ్యాణికింకి ణికి ఈ విషయాలన్నీ నిన్నో మొన్నో జరిగినంత స్పష్టంగా జ్ఞాపకం వచ్చినై. ఈ జ్ఞాపకాలన్నీ యింకా వేడివేడిగానే వున్నయి ఆమెకు. ఆ వేడికి ఆమె మనస్సు కరిగి ద్రవించింది. రవివర్మను చూడా లనిపించింది. ఆరోజే హైదరాబాద్‌కి బయలుదేరింది.

రైలు హైదరాబాదు వచ్చేటప్పటికి తెల్లవారి ఆరు గంటలయింది. ఎక్కువమంది ప్రయాణీకులు సికింద్రాబాద్ స్టేషన్లో దిగిపోయారు; కొద్దిమంది మాత్రం మిగిలారు.

ఇంకా మసకమసకగానే వుంది. కళ్యాణకింకిణి రైలుదిగి, రవి వర్మ కోసం చూచింది; కనుపించలేదు. దూరంగా ఒంటరిగా ఎవరన్నా వ్యక్తి నిలబడివున్నాడేమోనని పరీక్షగా చూచింది; ఎవ్వరూ లేరు.

అంతలో సూట్‌తో వున్న ఒకవ్యక్తి కంపార్ట్‌మెంట్ దగ్గరకువచ్చి, 'కళ్యాణకింకిణిగారు మీరేనా' అనిఅడిగాడు.

"నేనే"

"మీరీ బండికి వస్తారనీ, వెళ్ళి తీసుకు రావలసిందనీ రవివర్మగారు చెప్పారు," అని "నేను ఆయన అడ్వొకేట్‌ని" అన్నాడు

"వారెక్కడ వున్నారు?"

"నిన్న ఉదయం వచ్చి నాకీ సంగతి చెప్పారు. తరు వాత మళ్ళీ కనుపించలేదు. ఏదన్నా పనిమీద వున్నారేమో! రాగానే మీకు చూపించవలసిందని ఒక కవరు యిచ్చారు. మా ఇంటికి వెళ్దాం."

ఇద్దరూ రవివర్మ అడ్వకేట్ యింటికి వెళ్ళారు. ఆయన డ్రాయరులోంచి రిజిష్టరు చేసిన ఒక పెద్ద కవరు తీసి కళ్యాణ కింకిణికి యిచ్చాడు. ఆ కవరు మీద తన పేరే వుంది. చించి చూచింది. అందులో ఒక రిజిష్టరు డాక్యుమెంటూ, ఒక ఉత్తరం వున్నాయి. ఆ రిజిష్టరు డాక్యుమెంట్ రవివర్మ తనకు వ్రాసింది. రవివర్మ తన యావదాస్తీ కళ్యాణకింకిణికి వ్రాసి యిచ్చాడు. ఆ డాక్యుమెంటు చదివి తన కండ్లను తానే నమ్మ లేకపోయింది కళ్యాణకింకిణి. రెండవది: రవివర్మ తనకు

వ్రాసిన ఉ త్తరం. ఆ ఉ త్తరం చదువ నారంభించింది. అందులో
ఇలా ఉంది.

'కళ్యాణకింకిణిగారూ!

మీరు నన్ను అపార్థ చేసుకోవద్దు. మీరు వెళ్ళిం
తరువాత మీరిచ్చిన సలహాను గురించి తీవ్రంగా ఆలోచిం
చాను. మీ సలహా అన్నివిధాలా సవ్యమైన సలహా అనే నిర్ణ
యానికి వచ్చాను. ఊర్మిళను మరచిపోవటానికి ఎన్నోవిధాల
ప్రయత్నించాను. ఆ పని నావల్ల కాకపోయింది. ఈపట్టణంలో
వున్నంతకాలం, ఆమె కనుపిస్తున్నంతకాలం మరచి పోవటం
అనేది సాధ్యంకాదని తెల్సుకొని, తీర్థయాత్రలు సేవించ
టానికి బయలుదేరాను. ఒక సంవత్సరంపైగా దేశాటనం
చేశాను. ఆమెను మరచిపోయాననే అనుకున్నాను. తిరిగి
ఈ పట్టణం వచ్చాను. నేను వచ్చానని తెలిసి ఆమె తన
భర్తతో నన్ను చూడటానికి వచ్చింది. ఆమెమీద నా కున్న
మమకారం ఇన్నాళ్ళనుంచీ యెక్కడ దాగిఉన్నదో, పగపట్టిన
పామల్లే పడగవిప్పింది_నామీద నాకే అసహ్యం వేసేటంత
రూపంలో.

నేను అనేక రాత్రులు ఆలోచించాను; నా మనస్సుని
చీల్చుకొని చూశాను. మీరు అన్నట్లు ఆమెపట్ల నాకున్న
మమకారంలో మాలిన్యం వుందని తెలుసుకున్నాను. ఆమెను
నేను గాఢంగా ప్రేమిస్తున్నానని తెలుసుకున్నాను. లేకపోతే
మరొకరితో ఆమె చనువుగా వున్నా, మరొకర్ని ప్రేమిం
చినా నేను బాధ పడటం యెందుకు? నేను ఎవ్వరిని, బాధ

పడటానికి? ఈ విషయం తెలిసినప్పటి నుంచీ నన్ను నేను భరించుకోలేక పోయాను. ప్రపంచం అంతా నన్ను చూచి వెక్కిరిస్తున్నట్లు అగుపించింది. ఎక్కడకు వెళ్ళినా నేను మొయ్యలేని యేదో పాపభారాన్ని మోసుకు వెళ్తున్నట్లుఅనిపించేది. నన్ను నేనే ద్వేషించుకుంటూ కొన్నాళ్ళు గడిపాను. ఇక ఈ తపన భరించలేను. నేను ఒంటరిగాణ్ణి. నాకు దగ్గర బంధువులుగానీ, ప్రియ స్నేహితులుగానీ లేరు. అందుకనే ఆప్యాయతకోసం అంత తహతహ లాడానేమో!

నా యాస్తి యావత్తూ మీకు రాసి యిచ్చాను. ఈ ఆస్తిని మీరు యేవిధంగా వాడుకున్నా వాడుకోవచ్చు. మళ్ళీ కలుసుకుంటామో, లేదో నేను చెప్పలేను. కలుసుకోవటం అనేది జరిగితేయెక్కడ కలుసుకుంటామో! ఏ విధంగా కలుసుకుంటామో!

—రవివర్మ'

ఉత్తరం పూర్తి అయింది. కళ్యాణకింకిణి కండ్లు చెమ్మగిల్లినై. పెదవులు ఒణికినై. నిబ్బరం తెచ్చుకొని, "ఇప్పుడాయన యెక్కడ వున్నట్లు?" అని అడిగింది.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను," అన్నాడు అడ్వొకేట్.

అంతలో ఫోను మ్రోగింది. అడ్వొకేట్ అవతలి మనిషితో మాట్లాడి, "సర్కిల్ ఇన్‌స్పెక్టరు ఒకసారి నన్ను రవివర్మ యింటికి రమ్మంటున్నాడు," అన్నాడు.

కళ్యాణకింకిణి గుండె గుభేలు మన్నది. "నేనూ వస్తాను," అన్నది.

వారు రవివర్మ యింటికి వెళ్ళేటప్పటికి అక్కడ జనం పోగయి వున్నారు. గేట్లో సర్కిల్ ఇన్స్పెక్టరు కలిసి మేడలోని గదిలోకి తీసుకువెళ్ళాడు. ఆ గదిలో ఒక మంచంమీద రవివర్మ శవం కంఠంవరకూ కప్పబడివుంది.

"ఇంతకుముందే హుశ్శైన్ సాగర్లో దొరికింది. ఒక జాలరివాడు చూచి మాకు రిపోర్టు చేస్తే బయటకు తెచ్చి ఇక్కడకు జేర్చాం" అన్నాడు.

ఆ మొహం యెంత నిర్వికారంగా ప్రశాంతంగా వుంది! కండ్లు మూసుకొనివున్నా తనవంకకు యెంతో దీనంగా, ఆప్యాయతగా చూస్తూవున్నట్లే వుంది. కళ్యాణకింకిణి భరించలేక పోయింది. రవివర్మ శవంమీద పడి కన్న తండ్రిని పోగొట్టుకున్న పసిపిల్లమల్లే భోరున యేడ్చింది. అంతా నిర్విణ్ణులై చూస్తూ నిలబడ్డారు.